క్లుప్తంగా

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సుజాత బాధ్యతల స్వీకరణ



రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కోదూరి సుజాత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రామకృష్ణను వీఆర్‌కు బదిలీ చేస్తూ సీపీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ సుజాతకు స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌కు నిధుల విడుదలపై హర్షం

హసన్‌పర్తి: మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ నిమిత్తం రూ.205 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సాంకేతిక అడ్డంకిగా ఉన్న 150కిలోమీటర్ల పరిమితిపై ఇప్పటికే కేంద్రం నుంచి అనుమతి పొందిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు నిధులు విడుదల చేయడం ద్వారా తన నిబద్ధతను మరోసారి చాటుకుందని పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్: భారీ వర్షాలతో లోతట్టు కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్య ఎదురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ సూచించారు. లోతట్టు ప్రాంతమైన మైసయ్యనగర్‌కాలనీని ఇన్‌స్పెక్టర్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వరద ప్రవాహాన్ని పరిశీలించి స్థానికులకు సూచనలు చేశారు.

ఇయర్ వైజ్ డిగ్రీ పరీక్షలు నిర్వహించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సుల పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా బాధ్యులు కోరారు. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్‌కు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది విద్యార్థులు ఒకటి, రెండు సబ్జెక్టులలో ఫెయిలయ్యారని, అలాంటి వారికి పరీక్షలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్‌కుమార్, బాధ్యులు రాజు, రవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏఐఎస్‌బీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకుడు సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’లో అన్నదానం

హన్మకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని స్పందన మానసిక దివ్యాంగులు, బధిరుల ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పిల్లలకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితా రెడ్డి అన్నదానం చేసి, పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో స్పందన ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, వసుధ, హరిత, దీప, అరుణ పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ఆరె కటికల కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. ఆ సంఘ అధ్యక్షుడు రావుల బాలరాజు నివాసంలో మొదటగా ప్రారంభించి ఇంటింటి సర్వే చేపట్టారు. కుల సంఘ జిల్లా అధ్యక్షుడు గోగికార్ రవీందర్ హాజరై కుల గణనను ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ తూర్పును పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. అందుకు ఆరె కటిక కులస్తులు సహకరించాలని కోరారు.

సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లో ఈనెల 26న బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో జరగబోయే విద్యార్థి సదస్సును విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, కేయూ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సు కరపత్రాలను కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కొమురయ్య, కలకోట్ల సుమన్, అరూరి రంజిత్, లంక రాజగోపాల్, కందికొండ తిరుపతి, కొనుకటి ప్రశాంత్, వస్తం అనిల్, సునీల్, విజయ్, రమేష్, అనిల్, రాజు పాల్గొన్నారు.

మోస్తరు నుంచి భారీ వర్షం



హనుమకొండ బస్‌స్టేషన్‌లో నిలిచిన వరద నీరు



హనుమకొండ టీటీడీ కల్యాణ మండపం పక్కన..



హంటర్ రోడ్డులో కురుస్తున్న వాన

- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరద
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు

హన్మకొండ: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంది. అప్పుడప్పుడు మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా వర్షం కురిసింది. వరంగల్ మహానగరంలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరి ప్రజలు, వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండలోని భవాని నగర్, అంబేడ్కర్ భవన్, నక్కలగుట్ట, నయీంనగర్, హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ కూడలి, కాకాజీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. అదేవిధంగా హనుమకొండలోని అశోక కాలనీలో వరదనీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు.

వరంగల్ జిల్లాలో..

శుక్రవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. వరంగల్ నెక్కొండలో 56.3 మిల్లీ మీటర్లు, చెన్నారావుపేటలో 50.8, గీసుకొండ మండలం గొర్రెకుంటలో 47.5, గీసుకొండలో 44.3, పర్వతగిరి మండలం కల్లెడలో 42.3, కాశిబుగ్గలో 41, వరంగల్ ఉర్సులో 37.3, నర్సంపేట మండలం లక్నెపల్లిలో 36.3, వర్ధన్నపేటలో 35.8, సంగెం మండలం కాపుల కనపర్తిలో 34.3, సంగెంలో 33.3, ఖానాపూర్ మండలం మంగళవారిపేటలో 32.5, పర్వతగిరి మండలం ఏనుగల్‌లో 21.5, నెక్కొండ మండలం రెడ్లవాడలో 21, దుగ్గొండిలో 17, నల్లబెల్లి మండలం మేడపల్లిలో 12.3, వరంగల్ పైడిపల్లిలో 8.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా హనుమకొండ పెద్దమ్మగడ్డలో 44.8 మిల్లీ మీటర్లు, కాజీపేటలో 44.8, భీమదేవరపల్లిలో 31.8, ఎల్కతుర్తిలో 30.3, ఐనవోలులో 28.5, దామెరలో 26, ఐనవోలు మండలం కొండపర్తిలో 25, ధర్మసాగర్‌లో 25, ధర్మాసాగర్ మండలం పెద్దపెండ్యాలలో 23.3, మండికొండలో 22.5, వేలేరులో 20.5, దామెర మండలం పులుకుర్తిలో 19.5, ఆత్మకూరులో 16, నడికూడలో 12.3, కమలాపూర్‌లో 12, హసన్‌పర్తి మండలం నాగారంలో 11.8, శాయంపేటలో 10.3, పరకాలలో 9.3, కమలాపూర్ మండలం మరిపల్లిగూడెంలో 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రావణ మాసం ప్రత్యేక పూజలు



మడికొండ: పుష్పాలంకరణలో అమ్మవారు



శ్వేతార్క ఆలయంలో..



బొమ్మల గుడిలో..

మడికొండ: శ్రావణమాసం మొదటి రోజును పురస్కరించుకొని మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శివాలయం, రామాలయాల్లో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.

‘శ్వేతార్క’లో నాగదండం పూజలు

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నాగదండం పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్వేతార్కుడితో పాటు నాగదండానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు.

కాశీ విశాలాక్షికి పసుపుతో అభిషేకం

ఖిలా వరంగల్: శ్రావణమాసం ప్రథమ శుక్రవారం సందర్భంగా రంగశాయిపేట రోడ్డులోని కాశీ విశ్వేశ్వర దేవస్థానం (బొమ్మల గుడి)లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారి కాపర్తి శంకర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపుతో అభిషేకం నిర్వహించారు.



హసన్‌పర్తి: పూజలు చేస్తున్న మహిళలు

హసన్‌పర్తి: ఇళ్లు ఆలయాలను తలపించే విధంగా గృహాల్లో పూజలు నిర్వహించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చకిలం సులోచన సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు చకిలం సులోచన ఇంటిలో శుక్రవారం శ్రావణలక్ష్మి (మహాలక్ష్మి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: గోవాలో ఆగస్టు 7న జరగనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జాతీయ ఓబీసీ మహాసభ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, బీసీ డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను ఈ మహాసభలో రూపొందించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ సంఘాల మూడు దశాబ్దాల పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, భీమగాని యాదగిరి గౌడ్, వేముల మహేందర్, కాసగోని అశోక్ పాల్గొన్నారు.

‘లక్ష్మీనరసింహ’లో ఐవీఎఫ్ డే



ర్యాలీలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

హన్మకొండ: అంతర్జాతీయ ఐవీఎఫ్ డేను హనుమకొండ నయీంనగర్‌లోని లక్ష్మీనరసింహ ఆస్పత్రిలో శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు సంధ్యారాణి, సృజన ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రతీ ఆరుగురిలో ఒకరు సంతానలేమితో బాధపడుతున్నారని తెలిపారు. ఐవీఎఫ్ అనేది చికిత్స మాత్రమే కాదు.. దంపతుల ఆశకు జీవరూపమూ అని వివరించారు. కార్యక్రమంలో జీఎంహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ వివేకానంద, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలను రిజర్వేషన్లలో చేర్చడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్ గౌడ్

హన్మకొండ: ముస్లింలను బీసీ రిజర్వేషన్లలో చేర్చడం సమంజసం కాదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ అభిప్రాయపడ్డారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీల్లో చేర్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీలకు ఉపవర్గీకరణ తప్పనిసరి అని అన్నారు. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసమే స్థానిక సంస్థల ఎన్నికల ముందు బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ డ్రామా ఆడుతోందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, ఆర్‌పీ.జయంత్ లాల్, సంద్ర మధు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు గుర్తింపు కార్డుల పంపిణీ



కార్డులు అందజేస్తున్న సెంటర్ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట జంక్షన్‌లోని పోతన గ్రంథాలయ ప్రాంగణంలో పీపుల్స్ మీడియేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ధర్మపురి రాజగోవిందు అధ్యక్షతన వృద్ధులకు గుర్తింపు కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది మండల పరశురాములు హాజరై రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ శాఖ అందజేసిన వృద్ధుల గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో బాల్నే సాంబమూర్తి, గుండు కామేశ్వరరావు, వడ్నాల నరేందర్, మంతెన సునీత, ఆర్.వెంకటేశ్వర్లు, అశోక్, సరోజిని, కోనె రవీందర్, దుస్స రాజ్యలక్ష్మి, మల్లేశం, కంచ సాంబమూర్తి, అంకం చక్రపాణి, ఈశ్వరయ్య, కుమారస్వామి, గంథాలయ ఇన్‌చార్జ్ డి.చంద్రమౌళి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖిలా వరంగల్: ఓ పత్రిక ఫొటోగ్రాఫర్ శ్యామ్ సతీమణి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ దంపతుల ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు గోపాల్ నవీన్‌రాజు శుక్రవారం పరామర్శించి రూ.50వేలు అందజేశారు. శ్యామ్‌ను పరామర్శించిన వారిలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణుగోపాల్, సిద్ధం రాము, మేడిది మధుసూదన్, బాసాని శ్రీనివాస్, పగడాల సతీష్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుగుణ



హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ ఇందిరానగర్‌కు చెందిన తేళ్ల సుగుణను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ తెలిపారు. ఈ మేరకు హనుమకొండలో ఆమెకు నియామక పత్రాన్ని శుక్రవారం అందించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు సుగుణ కృతజ్ఞతలు తెలిపారు.

దేశసేవ చేసేందుకు ముందుకు రావాలి



క్యాంపులో పాల్గొన్న ఎన్‌సీసీ కేడెట్లు

కేయూ క్యాంపస్: ప్రతిభ గల ఎన్‌సీసీ కేడెట్లను ఢిల్లీలో జరగబోయే గణతంత్ర వేడుకలకు పంపనున్నట్లు కమాండెంట్ కల్నల్ ఎస్.రామదురై తెలిపారు. దేశసేవ చేసేందుకు కేడెట్లు ముందుకు రావాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీలో 10 బెటాలియన్ ఎన్‌సీసీ ఆర్మీ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో 10 రోజుల కంబైండ్ అన్యూవల్ ట్రైనింగ్ క్యాంపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డీ పరేడ్‌కు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ కేడెట్ల సెలక్షన్ క్యాంపు ఇది అని, ఆగస్టు 2వ తేదీ వరకు ఈ క్యాంపు కొనసాగుతుందని చెప్పారు. లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కెప్టెన్ డాక్టర్ సతీష్, కెప్టెన్ డాక్టర్ సదానందం, ఎస్‌ఎం సీనియర్, జూనియర్ కమిషన్ ఆఫీసర్ సొరస్య, ట్రైనింగ్ విభాగం ఇన్‌చార్జ్ కదం, లెఫ్టినెంట్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

విద్యారణ్యపురి: జిల్లాలో పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేసి, రోజు కొంత సమయం పాఠశాలల్లోని గ్రంథాలయాల్లో విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి కోరారు. హనుమకొండ జిల్లాలో అన్ని ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశాలు శుక్రవారం జరిగాయి. జిల్లాలోని ఉప్పల్ బాలికల ప్రాథమిక పాఠశాలలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదవడం అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వాణిశివప్రసాద్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించాలి



అభివాదం చేస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

హన్మకొండ అర్బన్: కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు అధిక సీట్లు ఇచ్చి గెలిపించాలని కోరుతూ అఖిల భారత యాదవ మహాసభ తీర్మానించింది. నిట్ సమీపంలోని మయూరి గార్డెన్‌లో అఖిల భారత యాదవ మహాసభ అత్యవసర సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. సమావేశంలో సిద్దిరాజ్ యాదవ్, గిరబోయిని రాజయ్య యాదవ్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, మామిండ్ల రాజు, వరంగల్ జిల్లా అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శులు బంక సంపత్ యాదవ్ మారబోయిన సమ్మయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూడయ్య యాదవ్, బొజ్జా సమ్మన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కాజీపేట అర్బన్: అర్హులైన దళితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కేవీపీఎస్ మండల కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కనీసం 60 గజాల భూమి లేక కిరాయి ఇళ్లల్లో పేదలు నివాసముంటూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తొలుత న్యూశాయంపేట డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో భూమి కోల్పోయిన 42మంది దళితులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య, గడ్డం అశోక్, రాజు, జంపాల రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగమ శాస్త్రానుసారం పనిచేయాలి



నియామక పత్రం అందజేస్తున్న ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: అర్చకులు దేవాలయాల్లో ఆగమ శాస్త్రానుసారం పూజలు నిర్వర్తించాలని, ఒకవేళ విరుద్ధంగా ప్రవర్తిస్తే దోషపరిహారం చెల్లించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. వరంగల్ జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు పాతర్లపాటి నరేష్‌శర్మ సూచన మేరకు హనుమకొండలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా అర్చక ఉద్యోగ జేఏసీ ప్రధాన కార్యదర్శిగా ఊటూరి అభిలాష్‌శర్మను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ జిల్లాలోని 6ఏ, 6బీ, 6సీ దేవాలయాల అర్చక ఉద్యోగుల సమస్యలు, ధూపదీప నైవేద్య అర్చకులు సమస్యలను దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని అభిలాష్‌శర్మకు పలు సూచనలు చేశారు.

ముమ్మరంగా దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

హసన్‌పర్తి: భూ భారతికి గ్రామసభలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. అయా గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని? వాటిలో మ్యుటేషన్, సాదా బైనామాతో పాటు ఇతర వివాదాలకు సంబంధించిన దరఖాస్తులను వేరుచేసే ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం మ్యుటేషన్, సాదాబైనామా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. అయితే, నగర పరిధిలోని వివిధ డివిజన్ల నుంచి వచ్చిన సాదాబైనామాల పరిశీలన సాగుతోంది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ చల్లా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని ఉత్తర్వుల మేరకు అమలు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రహీం, ఆర్ఐలు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపులో ‘గంజాయి నిందితులు’



నిందితుడి అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ సైదులు

రామన్నపేట: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.51,081 విలువైన గంజాయితో పాటు నంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు నార్కొటిక్ డీఎస్పీ సైదులు తెలిపారు. ములుగు రోడ్డు సమీపంలోని నార్కొటిక్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాల వెల్లడించారు. నర్సంపేట రోడ్డులో శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కాకస్ రోడ్డు డొంకరాయి గ్రామానికి చెందిన మైలపల్లి మోహిత్, అదే ప్రాంతానికి చెందిన పదిహేడేళ్ల బాలుడు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పండు అనే యువకుడు ఇచ్చిన సుపారితో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆ ఇరువురిని అరెస్టు చేసి పండు కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

గంజాయి తాగుతూ ఆరుగురు..

మడికొండ: గంజాయి తాగుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు ఎలుకుర్తి క్రాస్ రోడ్డు వద్ద ఆరుగురు వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే సమాచారంతో వివేక్, అఖిల్, సందీప్, రాజశేఖర్, శివకృష్ణ, వికాస్‌ను మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 200గ్రాముల గంజాయి, 5 సెల్ ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

టీఎంకేఎంకేఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు అలంకార్ జంక్షన్‌లోని టీఎన్జీఓఎస్ భవన్‌లో శుక్రవారం జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన సంఘం రెండో మహాసభల ముగింపు సభలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ తెలిపారు. అధ్యక్షుడిగా నిమ్మల విజేందర్, ప్రధాన కార్యదర్శిగా గొడుగు వెంకట్, ఉపాధ్యక్షులుగా బొజ్జం స్వామి, జూనగారి దుర్గయ్య, దువ్వ సమ్మక్క, తెట్టె రవి, మాటూరి సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా పిట్టల రవి, మొరె కుమారస్వామి, మౌటం పవన్ కల్యాణ్, నీలం భానుచందర్‌తో పాటు 30 మందితో జిల్లా కమిటీ ఎన్నికైనట్లు వివరించారు.

సంక్షిప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో లారీ డ్రైవర్‌కు జైలు

హసన్‌పర్తి: మద్యం మత్తులో వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ డ్రైవర్‌కు ఐదు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి వేణుగోపాల్ తీర్పునిచ్చారు. నల్గొండ జిల్లా తిమ్మపూర్‌కు చెందిన అంజిబాబు.. రెండు రోజుల క్రితం సిమెంట్ లోడ్ లారీతో కరీంనగర్ వైపునకు బయల్దేరాడు. ఈ క్రమంలో హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో అంజిబాబు మద్యం తాగినట్లు తేలింది. దాంతో అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా శిక్ష విధించగా, పరకాల జైలుకు పంపినట్లు ఎస్సై దేవేందర్ వివరించారు.

రైలునుంచి జారిపడి ప్రయాణికుడికి గాయాలు

హసన్‌పర్తి: రైలునుంచి జారిపడి ఓ ప్రయాణికుడికి గాయాలైన సంఘటన చింతగట్టు – జయగిరి రైల్వే ట్రాక్ మధ్య శుక్రవారం జరిగింది. ఢిల్లీ వైపు నుంచి కాజీపేటకు వస్తున్న ఓ రైలు జయగిరి – చింతగట్టు మార్గమధ్యలోకి రాగానే రైల్వే ట్రాక్‌పై ప్రమాదవశాత్తు ఓ ప్రయాణికుడు జారి కిందపడ్డాడు. దాంతో అతడి తలతో పాటు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు అంబులెన్స్ డ్రైవర్ గురునాథ్, టెక్నీషియన్ ప్రకాష్ తెలిపారు.